

# తపోవనం

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

డైనింగ్ టేబుల్ పై భార్య పదార్థాలు అమర్చుతూన్న వరలక్ష్మి మేడ మెట్ల మీది శబ్దం విని అటు చూసింది. సుమతి నీటుగా తయారై ఎక్కడికో బయలు దేరింది. వరలక్ష్మికి కాస్త కోపం వచ్చింది.

"ఇంత హడావిడిగా వున్ననాడు కూడ కాస్త చేతిసాయం లేకుండా ఎక్కడికే ఆ తయారు సుమా?"

తల్లి అదలింపు విని మేడ మెట్ల మధ్యనే ఆగనైతే ఆగింది కానీ ఇటు చూడకుండా పుస్తకాలు సర్దుకోసాగింది సుమ.

"మాట్లాడవేం? లైబ్రరీకేనా?"

"ఔనమ్మా."

"అవి రోజూ వుండేవే. ఇవ్వేళ్టికి మాతో రా."

"ఎక్కడికి? ఆ ఆఫీసర్స్ పార్టీకేనా? నాకు అక్కడ తోచదమ్మా. నువ్వూ నాన్నగారూ వెళ్ళండి."

"ఎందుకు తోచదు? అంతా కుటుంబా లతో వస్తున్నారివాళ! నీ ఈడుపిల్లలు చాలామంది వుండవచ్చు. క్రొత్త ఆఫీసర్ వస్తున్నాడు కదా? ఎన్నో ఎంటర్ టెయిన్‌మెంట్సు వుంటాయి. అసలు ఆ ఆఫీసరే స్వయంగా ఎన్నో కళల్లో ఆరితేరిన వాడట? చాలా పేరుందట...."

"చాలా భోగట్టా సంపాదించావు! ఇకనేం? అతడికి పెళ్ళికూడా కాలేదట యింకా. అది కూడా తెలుసా?" ప్రక్క గదిలోనుండి పార్థసారధి నవ్వుతూ అడుగుతున్నాడు భార్యను.

"ఔనటండీ, ఇంతకు ముందే జగదాంబగారు ఫోన్‌చేసి చెప్పింది. అయితే మీకు యింతకుముందే తెలుసా?"

తల్లీ తండ్రీ మాట్లాడుకుంటూంటే తాను మెల్లగా జారుకున్నది సుమతి. తిరిగి వచ్చాక తల్లి ఎంత హంగామా చేస్తుందో తెలుసు. అయినా తల్లి తిట్టే తిట్లే నయం, ఆ విందులలో జరిగే తలనొప్పి సంఘటనల కంటె.

"పెళ్ళి కావలసిన పిల్లల తల్లులంతా ఎగబడి పోతున్నారూ నీకేం నిమ్మకు నీరెత్తినట్లు కూడా లేదూ?' అని కూడా మందలించిందండీ జగదాంబ గారు!"

"సరిపోయింది. అతడికిక్కూడా ఓ యిష్టం అంటూ వుంటుందిగా? వీళ్ళెగబడగానే సరా?"

"చాల్లెండి. ప్రయత్నాలు లేకుండానే పనులౌతాయా? ఏదీ సుమతి వెళ్ళిపోయిందా? కొంప ముంచింది కదూ?"

"ఏం ఏమైంది?"

"ఆ మధ్య కొన్న ఆ ఫారెన్ చీర కట్టుకొని అందంగా తయారై మనతో రమ్మన్నాను దాన్ని. ఏం చేసిందో చూడండి."

"నీ ఉపాయం బాగానే వుంది కానీ ఇటువంటి స్వప్రలోభపు పనులు మనకు తగునా అని?"

"కాలంబట్టి నల్గురిలా నడవాలి. మీరు తయారౌతూండండి, నేను దాన్ని వెనక్కు లాక్కొస్తాను."

తల్లి స్వభావం తెలిసిన సుమతి లైబ్రరీకి వెళ్ళలేదు. ఒక స్నేహితురాలింటికి వెళ్ళింది! గంట ముందునుండీ డ్రస్సింగ్‌టేబుల్ వద్దవున్న ఆమె సుమతిని చూడగానే ఏదో విడ్డూరం జరిగినట్లు కెవ్వున అరచింది.

"నువ్వు పార్టీకి రావడంలేదూ?"

"అది మన తలిదండ్రులకు, మనమెందుకూ?" అన్నది చికాకుగా సుమతి.

"ఔననుకో, ఆ ఆఫీసరు ఒక రాకుమారుడిలాండి వాడట? తెలుసా?"

అంటూన్న ఆమె కనులలోని మిలమిలలు సుమతికి వెగటనిపించాయి.

"అయితే మనకేం ఒరిగిందటా?"

"అంత వెఱ్ఱిదానిలా మాట్లాడకు, ఆ రాకుమారుడి సరసన జీవితాంతం స్థానం దొరుకుతుందేమోనన్న ఆశ!"

సిగ్గు విడచిన ఈ మాటలకు సుమ నిర్వీణ్ణయై చూచింది.

"అలా చూస్తావేం? ఏం నీకుమాత్రం ఆశలేదూ? పెళ్ళి కావలసిన వాళ్ళం. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనుకోవడంలో తప్పేముందీ? మన కులం వాడేట. విద్యా, విత్తం, రూపం గలిగినవాళ్ళం నలుగురం వున్నాం!"

"నలుగురా?"

"ఔను. ఎగ్జిక్యూటివ్ యింజనీరు కూతురు కరుణ, అకౌంట్స్ ఆఫీసర్ కూతురు లక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చెల్లెలినైన నేను, లెయిజాన్ ఆఫీసర్ కుమార్తెవైన నువ్వు! చూద్దాం ఎవరి పంట పండుతుందో?"

"సారీ రత్నం నన్ను జేర్చకు లిస్టులో. ఇటువంటి మాటలు మాట్లాడ్డానికి నీకు సిగ్గులేదూ?"

"ఐడాయి! నంగనాచిలా మాట్లాడకు. నిన్ను మీ అమ్మగారు తీసుకొస్తున్నారని జగదాంబగారు ఫోన్‌చేసి చెప్పాకనే మీ అన్నా వదినలకు ఈ పిచ్చి పట్టుకుంది. గంటనుంచి అవస్థపడ్తూన్నా ఈ హెయిర్‌స్టైల్ కుదరడం లేదు. కాస్త హెల్పు చేద్దూ."

చికాకుగా లేచి వడివడిగా ద్వారం వైపు అడుగులు వేస్తూ అన్నది సుమతి, రత్నంతో.

"ఏ బ్యూటీ సెంటర్‌కో పోరాదూ ఇంకా చాలా టైముంది. నేను మాత్రం నీకు పోటీ రావడంలేదులే. ధైర్యంగా వుండు."

ఇల్లు దాటి రోడ్డు మలుపు కూడా దాటాక సుమతి గుర్తించింది తన వానిటీ బాగ్‌ను స్నేహితురాలింటనే వదిలినట్టు.

వెనక్కి తిరిగి వచ్చిన ఆమె నివ్వెరపోయింది.

"యేం రత్నం. ఇంత తెలివితక్కువదాన వేమిటి? నువ్వెందుకు ఆ పార్టీకి వెళ్తున్నావో పూసగుచ్చినట్లు నీ స్నేహితురాలికి చెప్పడంలో అర్థమేమిటి? నీ గొయ్యి నువ్వు తీసుకున్నట్లు కాదూ? వాళ్ళకేం భాగ్యవంతులు. మేం నీకు కట్నాలివ్వలేంగా? దొరికిన అవకాశాన్ని జారవిడిచుకోకుండా జీవితాన్నేర్పరచుకొంటావో, కాలద్రోసుకుంటావో నీ యిష్టం."

ఆ కంఠం రత్నం వదిన జానకిది. రత్నాన్ని ఆఫీసర్ రావ్‌ను గురించిన రహస్యాన్ని తనకు చెప్పినందుకే జానకి మందలించుతూన్నట్లు అవగతమైంది సుమతికి.

"నా బ్యాగ్ మరచిపోయాను రత్నం" అంటూ ఏమీ విననట్లే లోనికి వెళ్ళింది.

జానకి వాక్ప్రవాహం ఆగింది.

సుమతి ఏమైనా విని వున్నదేమోననే జంకు రత్నం కనులలో స్పష్టంగా కన్పిస్తూన్నది.

"వెళ్తున్నా వదినా" అన్నది జానకితో సౌమ్యంగా ఆమె తనను పలకరించక పోయినప్పటికీ సుమతి.

"మంచిదమ్మా" అంటూన్న జానకి బలవంతంగా నవ్వును పెదాలకు పులిమినట్లు కన్పట్టింది. కళ్ళు చురచురమంటూనే వున్నాయి.

సుమతి గడపకవతల ఆగి అన్నది రత్నంతో:

"రత్నం. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్. నువ్వు పిలిచినా పార్టీకి రావడంలేదనీ నీకు తోడుగా నిలవడంలేదనీ కోపం పెట్టుకోకు. పెద్దవారి విందులలో నేను ఎంజాయ్ చెయ్యలేను. మరొక్క విషయం— కులం, రూపం, విద్యా విత్తం మాత్రం ఉండగానే అతగాడికి సరిపోతుందనుకొని ఎక్కువగా ఆశలు పెంచుకోకు. అవన్నీ కాదని అతడు రపీమని ఏ క్రిస్టియన్ స్టెనోనో వరించినా మరి వగచ కూడదు. పోటీలో పాల్గొనే వాళ్ళకు ఓటమిని కూడా చిరునవ్వుతో స్వీకరించగల స్పోర్టివ్‌నెస్ వుండాలి!"

ఆ ఉపదేశం రత్నానికి కాదనీ, తనకే ఉద్దేశింపబడినదనీ జానకి గ్రహించే లోపునే సుమతి నిష్క్రమించింది.

ఇక తక్కినవాళ్ళెలా వున్నారో-వాళ్ళుమాత్రం తనతో పిక్చర్‌కు వస్తారని నమ్మకమేమిటి? అయినా చూద్దామని బయలుదేరింది. సుమతి అంచనా తప్ప లేదు.

బీర్వాలోని ఖరీదైన చీరలన్నీ బయటకు లాగబడి మంచంమీద పరచి వున్నాయి. అస్తవ్యస్తంగా కరుణ గదిలో ఒక్కొక్కదాన్నే భుజంపై వేసుకొని అటూ యిటూ త్రిప్పుతూ, తాను తిరుగుతూ అందాలనూ, సోయగాలనూ అంచనా వేస్తోంది కరుణ అద్దంముందు నిలబడి.

"అబ్బ! చేతులు పీకేస్తున్నాయి. మెడ నొప్పి పుడుతోంది."

విసిగిపోయినట్టు మంచంమీద కూలబడుతూ, గుమ్మంలో నిలబడి తననే చూస్తూన్న సుమతిని గమనించి స్ప్రింగులా గెంతింది!

"హాయ్. సమయాని కొచ్చావే."

"ఏం, ఏమిటి సంగతులు? పెళ్ళి చూపులా?"

అతి మామూలుగా అడిగింది సుమతి.

"ఇంచుమించు అలాంటిదే. అంతకంటే ప్రాణసంకటమైనది. ఈరోజు పార్టీకి రంభలా తయారై రమ్మంటోంది మమ్మీ. నువ్వు చెప్పు నాకు చీర బాగుంటుందా, మాక్సీయా? ఎలా అలంకరించుకోను?"

సుమతి కొద్దిక్షణాలు ఆలోచించింది.

'ఇదొక జబ్బులా అందరినీ ఆవరించిందా? సిగ్గూ అభిమానం అనేవి లేనేలేవా? ఔను, తలిదండ్రులే పిల్లలను అందుకు ప్రోత్సహిస్తుంటే ఇక అనుకొనే దేమున్నది? నేనేం మాట్లాడి మాత్రం ప్రయోజనమేమిటి?'

ప్రకాశంగా అన్నది! "ఒక పని చెయ్యి కరుణా. లక్ష్మికి ఫోన్ చెయ్యి,

రత్నంకు కూడా ఫోన్ చేసి అడుగు, వాళ్ళే పద్ధతిలో వస్తున్నారో అందుకు భిన్నంగా వుండాలనుకొంటున్నావు కదూ?"

"ఉపాయం బాగానే వుందే?"

"మరి నేను వెళ్తున్నా."

"ఇంతకూ నువ్వు ఏ ప్లానులో వున్నావు? పంజాబీ డ్రెస్సా?"

సమాధానంగా కరుణను పరీక్షగా చూస్తూ భావయుక్తంగా నవ్వింది సుమతి.

"ఇదే వేషం నాది?"

"ఏమిటీ? కళ్ళు తిరుగుతున్నాయి నాకు? ఈ సాదా సిల్కు చీర, ఒక్క జడ యింతేనా? నేను నమ్మను."


"ఇంతే. నేను మ్యాటనీషో చూచి, సాయంత్రం కొంత షాపింగ్ పనిచేసుకొని ఆపైన మీరంతా పార్టీనుండి వచ్చే వేళకు యింటికి జేరుకుంటాను. మా అమ్మ తిట్లే భోజనంగా స్వీకరించి పడుకొంటాను. అంతే."

ఆశ్చర్యం నుండి తేరుకుని కరుణ మాట్లాడే లోపున సుమతి వెళ్ళిపోయింది. అయితే ఆమె మస్తిష్కం మహారణ్యంలా వున్నది.

'ఈ కాలానికి తగనిది, బీసీ నాటి బ్రూట్' అని తనను అందరూ ఆఖరుకు ఇంట్లో తల్లి కూడ అనుకోవడం సుమతికి తెలుసు! ఇప్పుడు కరుణ అలాగే అనుకుంటుంది. అనుకోనీ, తనలో స్వార్థం అధికమైనదని అనుకోక 'కాలం' అంటూ సర్ది చెప్పుకొంటున్నారు ఎవరికి వారు. కాలం మారలేదు. మనుష్యులే మారి పోతున్నారు.

'నేను మాత్రం మారలేను. మనిషిని జంతువు నుండి భిన్నంగా ఉన్నతంగా నిలబెట్టేది ఈ లజ్జాభిమానాలే కదు!' అనికూడా అనుకున్నది.

అలా ఒకరికంటే ఒకరు కరుణా, రత్నం, లక్ష్మి పోటీలుగా అలంకరించుకోవడం, ఉన్న స్థాయినుండి ఒక్కసారిగా పైపైకి ఎదిగిపోవాలనుకోవడం, అందుకు ఎంత అభిమానహీనంగానైనా ప్రవర్తించడం, వారికి తలిదండ్రులు కూడా మద్దతునీయడం సుమతి గమనించుతూనే వున్నది.



సాధారణంగా స్త్రీని పుష్పంతోనూ పురుషుడుని భ్రమరంతోనూ పోల్చుతారు. అయితే కరుణ విషయంలో ఈ నానుడి అటు యిటైంది. ఆఫీసర్ చుట్టూ రకరకాల వేషాలతో తానే భ్రమరమై పరిభ్రమించిన కరుణ ఆరునెలలు తిరిగేసరికి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నదో ఎవరికీ తెలియదు.

'ఆఫీసర్ భార్య కావాలని ఆశపడ్డానే కానీ యిలా అప్పుడే ఆయువు మూడి అంపకాలకు బదులు అంత్యక్రియలు చేయాల్సి వస్తుందనుకున్నామా?'

అని విలపించారు కరుణ తలిదండ్రులు.

అంతకు పూర్వమే అతడి వద్ద అతి ప్రయత్నంపై పర్సనల్ సెక్రెటరీగా కుదురుకున్న రత్నం మాత్రం మరో నాల్గు నెలలు గడిచేసరికి ఆఫీసర్‌కి అర్ధాంగి అయింది.

ఆ పెండ్లి విందులో రత్నమూ ఆమె అన్నావదినలు కనబరచిన అతిశయాడంబరాలను కొలిచే పరికరం ఏదీ లేదనుకున్నది సుమతి.

ఈ పోటీ సందెంలో ఓడిన లక్ష్మి నిరుత్సాహపడక మరో ప్రయత్నం మరో ప్రయత్నం చేస్తూనే వున్నది.

ఆంధ్రదేశంలో కొంత పేరుగల ఒక రచయితకు అభిమానినిగా అనేక ఉత్తరాల వాన ఏడాదిపాటు కురిపించి అతడిని సన్మానసభ మిషతో తమ ఊరు రప్పించ గలిగిన లక్ష్మి, ఆ సన్మాన సభ నిమిత్తం అయిదువేలు ఖర్చైందని చెప్పినప్పుడు సుమతి ఆశ్చర్యానికి లోనైంది! మరో నాల్గు నెలల అనంతరం పుస్తక ప్రదర్శన ప్రారంభకుడుగా మరలా ఆ రచయిత ఆహ్వానింపబడి, వెంచేసి, లక్ష్మి యింట విడిది చేసినప్పుడుగానీ, లక్ష్మి తల్లి మరలా రెండు మాసాల అనంతరం తాను అధ్యక్షురాలిగా వున్న మహిళా మండలి సాంస్కృతిక వారోత్సవాలకు అతడిని ప్రధాన అతిథిగా ఆహ్వానించి ఆట్టహాసం చేసి 'రచనాధురీణ' అనే బిరుదుతో పట్టంకట్టినపుడు కానీ తదితరులంతా ఆశ్చర్యపోయినట్లు సుమతి ఆశ్చర్యపోనూలేదు: చాటుమాటు చెవి కొరుకుళ్ళలో భాగస్వామినీ కాలేదు.

మరో రెండు మూడు నెలలలో లక్ష్మి ఒక చిన్న తరహా రచయిత్రి కావడమూ, ఆ రచయితకు జీవిత భాగస్వామి కావడమూ జరిగిపోయింది.

"సంఘంలో పేరూ, ప్రతిష్ఠా, గుర్తింపూ వున్నవాళ్ళే మనుషులు కానీ-ఛీ-ఎందుకూ అనామకులుగా బ్రతికేం? పెద్ద ఆఫీసరి భార్యనని విఱ్ఱవీగింది రత్నం, మహా ఎంత మందికి తెలుస్తుందటా అతడి పేరు? ఆ ఆఫీసులోనూ, వాళ్ళ వీధిలోనూ అంతేగా? నా భర్తను ఎరుగని అంధ్రులుంటారా?"

అని రత్నం స్వోత్కర్షను విన్పించినప్పుడు శ్రోత సుమతి కనులు అప్రయత్నంగా ఆకసం దెస తిరిగాయి 'భగవాన్' అనుకుంటూ,

'అందని ద్రాక్షపండ్లు పుల్లనే కానీ మరీ ఇంత పులుపా?'

"అందరి పిల్లలకూ పెండ్లిలై పోతున్నాయి, అదృష్టవంతులు ఆ తలిదండ్రులు. ఎందుకు చూస్తూ మిగిలిపోయాం నేనూ నా కూతురూ."

అని తల్లి సణుగుతున్నప్పుడల్లా ఆమె సమక్షం నుంచి ఏదో మిషతో తప్పుకొనడమేకానీ మాట్లాడదలచుకోలేదు సుమతి, తండ్రి ఒక్కరే కాస్త సుమతి మనసులోని సుమలాలిత్యాన్ని అర్థంచేసుకున్న మనిషి.

సంవత్సరాలు గడుస్తూన్నాయి, అయినా ఈ పై సంఘటనలలో దేనినీ సుమతి మరువలేదు: లోకం తీరుకు ప్రేక్షకురాలుగా మాత్రమే వుండిపోయే ఆమె మనుష్యుల మాటలనుబట్టి వారి మనోగత పరివర్తలను అంచనా వేసుకొని వ్యాఖ్యానం చెప్పుకొంటుంది.

మరిన్ని సంవత్సరాలు నడిచాయి.

ఇపుడు సుమతి ఇద్దరు బిడ్డల తల్లి. ఇద్దరూ గ్రాడ్యుయేట్స్. పరిచితులూ, తలిదండ్రులూ అందరనేదీ ఒకటే మాట-

'సుమతి ఏమీ మారలేదు. అప్పుడూ యిప్పుడూ ఎప్పుడూ ఒకటే. గంభీర స్రవంతి.' అని.

సుమతి కుమార్తె వివాహంచేసి సాగనంపటానికి ముందు కుటుంబమంతా సరదాగా మహాబలిపురం పిక్నిక్‌కు వెళ్ళారు.

"అమ్మాయీ, అల్లుడూ చక్కటి జోడీ కదూ సుమా."

అని మురిసిపోతూ అడుగుతూన్న భర్త అశ్వనీరావుకు చిరునవ్వుతో సమాధానం చెప్పింది సుమతి:

"వాళ్ళూ మనలాగా చక్కగా ఆనందంగా సంసారం చేసినపుడు కదండీ చక్కటి జోడీ అనడం? చూపులకు అందాలు బాగానే వున్నాయి."

అశ్వనీ నవ్వేశాడు.

"నీ కూతురు నీ అంత తెలివిగానూ సంసారం చేసి రికార్డు స్థాపించకలదనే నమ్మకం నా కున్నదిలే సుమా: నా చిన్నప్పటి స్నేహితులూ, కాలేజీ స్నేహితులూ ఎవరు కలిసినా అనేమాట ఒకటే-'నీ మిసెస్ చాలా తెలివైన వ్యక్తి, అంత ఆకతాయి కొంటె కోణంగి గాడినీ, అపర శ్రీకృష్ణావతారాన్నీ ఇంత సౌమ్యునిగా ఎలా మార్చింది?' అని.

ఎగదన్నుకు వస్తూన్న ఆనందాన్ని ప్రదర్శించక జాగ్రత్తపడుతూ తలవాల్చి ఇసుకలో ముగ్గులు దిద్దుతోంది సుమతి.

అంతా దూరంగా ఆటపాటల్లో మునిగివున్నారు.

అశ్వనీ హస్తం సుమతి భుజం చుట్టూ వ్యాపించింది.

"చెప్పు సుమతీ. నేనూ అదే ప్రశ్న అడుగుతున్నా నిన్ను. నన్నెలామార్చావు? ఎప్పుడూ నువ్వు నాతో దెబ్బలాడలేదు, కన్నీళ్ళు గ్రుమ్మరించలేదు. అలిగిన జ్ఞాపకం కూడా లేదు. మరి నన్నెలా మార్చావు?"

సుమతి అరమోడ్పు కనులతో పాతాళగంగ పెల్లుబికింది.

"సుమా!"

"కంగారు పడకండి. ఇవి........ఇవి ఆనంద బాష్పాలు. అతి కొద్దిమంది గృహిణులు మాత్రమే రాల్చగల పన్నీటి ముత్యాలు: భర్త నుండి యింతకంటె ప్రశంస ఏం కావాలి ఏ గృహిణికైనా?"

"సమాధానం సూటిగా చెప్పవా?"

"ఏం చెప్పను? ఆలోచించండి. మీకే అర్థమౌతుంది. కన్నీళ్ళూ, కోపతాపాలూ నాకూ నా మనసుకే పరిమితం చేసుకున్నాను. ప్రేమాప్యాయతలూ, సేవా సరస సల్లాపాలూ, సుఖశాంతులూ మాత్రమే మీకు అందించాను. భగవత్కృపవల్ల కొంత కాలానికైనా అవి తిరిగి పొందగలిగాను........"

గతాన్ని నెమరువేసుకొంటూ మైమరచి వున్న అశ్వనీరావుగానీ, తమను ఎవరో పేరుపెట్టి పిలుస్తూన్నట్లు గమనించలేదు కొంతసేపటివరకూ.

"ఓ రత్నం!" అన్నది సుమతి ఆశ్చర్యంగా కళ్ళు తెరచి.

"హమయ్య, గుర్తించావు కదా?" అన్నది రత్న అశ్వనీదెస అయోమయంగా చూస్తూ.

అశ్వనీ దూరంగా జరిగాడు.

రత్నం కనులలో విపరీతాశ్చర్యం.

"ఈయన .... ఈయన సినీనటులు అశ్విన్ కాదూ?"

"ఔను." దర్పంగా అన్నది సుమతి.

"మరి........?"

ఫకాలున నవ్వింది సుమతి, అశ్విన్ నవ్వుకూడా జోడైంది.

"నేను వివాహమై ఫారెన్ వెళ్ళిపోయాక మీ ఎవరి సంగతులూ తెలియవే బాబూ నాకు. అయితే మీవారా ఆయన?"

"పిచ్చిమొహమా, కాకుంటే ఏమిటే?" సుమతి చురుకుగా చూస్తూ అడిగింది.

"సినిమా షూటింగని అనుకున్నారేమో?"

అని చమత్కరించాడు అశ్విన్.

"ఔను మరి, సినీనటుల ప్రక్కన భార్యలే వుండాలని లేదుగా? అయినా నువ్వేం తక్కువ? ఆనాటికీ ఈనాటికీ అలానే వున్నావు మిసమిసలతో హీరోయిన్‌లా, అందుకే అలా అనుకున్నాను."

"నోరు మూద్దూ."

అని సుమతి రత్నంను మందలిస్తూ భర్తకు ఆమెను పరిచయం చేసింది.

"సంతోషం, సుమా. నేను అటు వెళ్ళాను, పిల్లలు మరీ నీళ్ళల్లోకి వెళ్తున్నట్లున్నారు, మీరు మాట్లాడుకోండి రత్నంగారూ."

స్నేహితురాం ద్దిరువురూ మాట్లాడుకొనే అవకాశాన్నిస్తూ అశ్విని దూరంగా వెళ్ళిపోయాడు.

నడచి వెళ్ళిపోతూన్న అశ్వనీనే తదేకంగా చూస్తూండిపోయిన రత్నం కనులలో చెప్పరాని బాధావేదనలూ దిగులూ ద్యోతకమయ్యాయి.

"ఏమిటి రత్నం అలా పరధ్యానంలో పడిపోయావు? నీ సంగతులేమిటి?"

"ఏమున్నాయి కానీ ఇంతటి సంస్కారవంతుడా నీ భర్త? ఈ వయస్సులో కూడా యింత ఆనందంగా వున్నావు ఏమిటే ఆ రహస్యం? అసలింతకూ ఇది చెప్పు — అంత మందకొడిగా వుండేదానవు నువ్వీ సినిమా మనిషినెలా బుట్టలో వేసుకున్నావే?"

"హుం బుట్టలో వేసుకోవడమా? ఆనాటికీ ఈనాటికే నాకు తెలియని విద్య అదే రత్నం."

"మరి? ఈయన .... ఇంత గొప్ప నటుడు...."

"ఔను, మా వివాహమయ్యే నాటికే అయన నటులు, వివాహానంతరం గొప్ప నటులయ్యారు."




"మరి....మీ పెళ్ళి...."

"మా పెళ్ళి పెద్దలే చేశారు. నేను ఎమ్మెస్సీ చదువుతూ ఒకసారి స్నేహితులతో ఇక్కడికి కొచ్చినప్పుడు విపరీతమైన వర్షంలో చిక్కుకుపోతే ఇక్కడ షూటింగ్ జరుపుకొంటూన్న సినిమా వాళ్ళు మాకు దయతో 'లిఫ్ట్' యిచ్చారు. ఆ వేన్‌లలో గమ్యం జేరేలాగా మా స్నేహితులందరూ ఆటోగ్రాఫ్స్‌కోసం ఆయనమీద పడిపోయారు. మాపైనా అడక ఓ మూలన కూర్చున్న నన్ను ఆయన అంటే హీరో అశ్విని పరీక్షగా చూశారు. తర్వాత ఎప్పుడో ఆరాతీసి మా నాన్నగార్ని కలిశారట. తర్వాత మా వివాహమైంది. అంతే, వివాహానంతరమే మే మిద్దరం మాట్లాడుకున్నది. మహాబలిపురమంటే అందుకే మా కంత యిష్టం, మా అమ్మాయి, అల్లుడూ, అబ్బాయి అరుగో...."

రత్నం విపరీతాశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి సుమతి కనులలో ఏమిటో వెదకసాగింది.

"ఏమిటే అలా చూస్తున్నావు రత్నం?"

"ఒకటి చెప్పు? నువ్వు ఆనందంగా ఎలా వున్నావు? లేక నటనా?"

"నువ్వు అలా అడిగితే ఇక చెప్పేదేముంది? ఇంతకూ నీ సంగతి ఏమిటి? పిల్లలెందరూ?"

రత్నం నీరసంగా చతికిలబడి మోకాళ్ళను చేత్తోచుట్టి కూర్చున్నది.

"ఏమని చెప్పను? ఆ రోగ్‌ను నేను పెళ్ళైన రెండేళ్ళకే విడాకులిచ్చి వదిలించుకున్నాను."

"అ:!"

"ఔను. ఎప్పుడూ ఆడవాళ్ళే వాడి చుట్టూ, ఛీ, డాన్‌యువాన్. ఆఫీసులో కొల్లీగ్, స్టెనో, సెక్రెటరీ, సబార్డినేట్స్‌కు సంబంధించిన కొందరాడవాళ్ళు ఆఖరుకు పనిమనిషి కూడ వాడికి రంభలే. అందరితోనూ....ఛీఛీ, తెగేసి చెప్పేశాను మరో ఆడదానితోనూ సంబంధం వీల్లేదని. తన కదే అలవాటన్నాడు. వదిలిపారేశాను తిరుచునాపల్లిలో ఒక ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నానులే యిప్పుడు!"

తృళ్ళిపడింది సుమతి.

"పిల్లలు?"

"ఒక్క ఆడపిల్ల. కోర్టులో కేసు జరిగే సమయంలోనే పోయింది. శని వదిలిందనుకున్నాను. ఛీఛీ, పెళ్ళి చేసుకోకపోతే పీడాపోయె."

"మీ అన్నా వదినా........"

"నా సంపాదనంతా మెక్కుతూ బాగానేవున్నారు వాళ్ళూ వాళ్ళ పిల్లలూ!"

కసిగా అనేసి కన్నీళ్ళు తుడుచుకున్నది.

"లక్ష్మి సంగతి నాకేం తెలియదు. నీకు తెలుసా!"

"అహ, అందరికీ తెలుసు మరి, నీకెందుకు తెలియదో?"

"మద్రాసు వచ్చేశాక మళ్ళీ మన ఊరు వెళ్ళలేదుగా? ఉత్తరాలూ లేవు. మీరు ఏనాడో పెళ్ళిళ్ళై పోయారుగా?"

"ఆఁ. ఆ తొందర పెళ్ళిళ్ళు. అలాగే పెడాకులయ్యాయి. లక్ష్మి భర్త రచయిత. దీని కేదో జబ్బుచేస్తే చక్కగా మళ్ళీ పెళ్ళిచేసుకొని దానిక్కూడా లక్ష్మినే చాకిరీ చేయమన్నాడట. భరించలేక వదిలి పెట్టేసింది. మళ్ళీ పెళ్ళిచేసుకొంది–అదీ విఫలమే. ఇప్పుడేదో సంఘసేవా ఆశ్రమాలూ అని స్థిరంలేకుండా తిరుగుతోంది. దానికి మగజాతి మీదనే వెగటు!"

"పాపం!"

చాలాసేపు నిశ్శబ్దానంతరం రత్నం అడిగింది:

"మామూలు వాళ్ళైన ఏదో కాస్త ప్రయోజకత్వమున్న మా మగవాళ్ళే యింత అధ్వాన్నంగా వున్నారే - మరి చుట్టూ ఎందరో అందగత్తెలూ, వగలాడిలూ వున్న నీ హీరోతో నువ్వెలా యింత ఆనందంగా వున్నావు?"

"వాళ్ళూ మనుష్యులే. మంచి చెడు వివక్షత వాళ్ళకే ఎక్కువ వుంటుందని నా అనుభవంతో చెబుతున్నాను రత్నం ఏ ఒక్క తెగనూ వృత్తినీ నిందిచడం నే నిష్టపడను. బలహీనతలూ, ఔన్నత్యాలూ ఎప్పుడూ ఏకపక్షం కాదు."

నిరసనగా నవ్వింది రత్నం.

"అంతగా ఉన్నతుడా అశ్వని అంతగా వెనకేసుకొస్తున్నావు?"

"ప్రయోజకుడైన ఏ వ్యక్తి చుట్టూనైనా అనేకమంది వారిలో ఎక్కువ ఆడవారే వుండటం గమనించాను ఒకస్థాయికి జేరుకొన్న ప్రయోజకుడైన నా భర్త చుట్టూ కూడా ఎందరో వుండేవారు. అయితే ఒకటి, అసూయకంటె నాలో గర్వమే చిందులాడింది ఆయన ఘనతను ఆరాధించేవారిని చూచి."

"అయితే చచ్చినట్టు బ్రతుకుతున్నావన్నమాట. మానాభిమానాలు వదిలి?"

కొరడాతో కొట్టినట్లే ఉలికిపాటుతో చూచింది సుమతి.

"నీలో అహం నీ మాటలలో వ్యక్తమైంది రత్నం. 'నీతోపాటు అడుగులు వేస్తూ బ్రతుకుతాను' అని బాస చేస్తూ ఆయనతో జీవితం ముడివేసుకున్న రోజుననే నేను అహాన్ని వదిలాను. 'నా' అని కాక 'మా' 'మన' అని ఆలోచించడం ప్రారంభించాను. ఇందుకే వివాహ ప్రమాణాల అర్థం. అందరికీ తెలియాలి."

"మహాజ్ఞానివి లెద్దూ."

కాకపోవచ్చు కానీ, అజ్ఞానిని మాత్రం కాను. నీ మాటలను బట్టిచూస్తే నీకు ఏమి చెప్పినా అర్థంకాదని మాత్రం నాకు అర్థమౌతోంది. అందుకే క్లుప్తంగా చెబుతున్నాను. ఈ సంసార జీవితం ఒక తపోవనం వంటిది. మునుల తపస్సును భగ్నంచేసే రాక్షసులవంటి మనస్తత్వం గలవాళ్ళు ఇక్కడా వుంటారు. రక్కసుల కోసం భగవధ్యానాన్ని తాపసి ఎలా వదులుకోడో అలాగే ఈ రాక్షసుల కోసం తన తపోవనమైన సంసారాన్నీ తన ఆరాధ్యదైవాలైన భర్త బిడ్డలనూ తెలివైన స్త్రీ వదులుకోదు. ఎవతో భ్రమరంలా తన భర్త చుట్టూ తిరిగి ఆ పురుగు విలువకు దిగజారితే, మరెవతో తన స్త్రీ గౌరవాన్ని పారవేసుకుని తన భర్తను పట్టి తిరుగుతూంటే మధ్యన తనను తాను ఎందుకు శిక్షించుకోవాలి ఇల్లాలు? తన జీవితం తన ఒక్కతిదే కాదు. తనపై ప్రాణాలు నిలుపుకున్న తల్లిదండ్రులది, తనపై ఆధారపడి అన్నిటికీ అమ్మా అని అడిగే చిన్నారులది, తన సేవలకోసం తాను నింపే కళకాంతుల కోసం ఎదురుచూచే గృహానిది: తన ద్వారా అభివృద్ధి చెంది ఈ పుడమిలో యింకా నిలవాలని కాంక్షించే తనభర్త వంశవృక్షానిది. ఇన్ని ఆలోచించక అహంతో మాట్లాడే స్త్రీకి స్త్రీ ననిపించుకోగల అర్హత లేదు."

రత్నం నుండి ఈసారి ఏ సమాధానమూ చాకులా దూసుకురాలేదు.

"చెప్పు రత్నం. కాదంటావా నా మాటలు? భర్త నుండి విడివడి నువ్వు నిజంగా సుఖంగా వున్నావా? శరీరానికి రోగం వస్తే మందులు మ్రింగి బాగు చేసుకుంటాం. ఇతరులకు వస్తే మందులు యిప్పించి బలవంతంగానైనా వైద్యం చేయించి సేవచేసి బాగుచేస్తాం. అలాగే మగని మనోరుగ్మతకు మందు చాలా వరకూ స్త్రీ సేవా, సహనం, అందుకు లొంగని ఏ కొద్దిమందినో తీసేయి. నీ భర్తకుఆ మాత్రం వైద్యం చెయ్యలేని నీవు నన్ను విమర్శించటానికే అర్హురాలివి కావు. లక్ష్మి సంఘసేవకూ అర్హురాలు కాదు. వస్తా, అదుగో మా వాళ్ళంతా ఎదురు చూస్తున్నారు."

ఆనందంగా పతీసుత సపరివారంతో సాగిపోయే సుమతిని సజల నేత్రాలతో చూస్తూ మిగిలిపోయింది రత్నం.